ఓటు.. సరిచూసుకోండి!

- ప్రారంభమైన సమగ్ర ఓటర్ల జాబితా సవరణ
- ఓటు నమోదుకు, సవరణలకు అవకాశం
- ఆగష్టు 21 వరకు ఇంటింటి సర్వే

కొల్లిపర: సార్వత్రిక ఎన్నికలు సుమారు మరో తొమ్మిది నెలల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. సవరణ ప్రక్రియ పూర్తి చేసి జనవరి 5న తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ఎన్నికలు ఏడాది లోపు ఉండటంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు దృష్టి పెడుతున్నాయి. ఇక ఓటర్లు కూడా తమ ఓటు ఉందా.. అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా.. అనేది సరిచూసుకోవాలి. చిరునామా మారి ఉంటే నియోజవర్గం పరిధిలో ఓటు బదిలీ చేయించుకోవాలి. 2024 జనవరి1 నాటికి 18ఏళ్లు నిండేవారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి.

బీఎల్వోలకు రిజిష్టర్లు, దరఖాస్తులు..

ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే శుక్రవారం ప్రారంభమైంది. బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ)ఆగస్టు21 వరకు ఈ సర్వే నిర్వహించనున్నారు. సవరణకు సంబంధించి బీఎల్ఓ రిజిష్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం-6), ఓటు తొలగింపునకు(ఫారం-7), నియోజవర్గం పరిధిలో ఓటు బదిలీకి(ఫారం-8) దరఖాస్తులను నియోజకవర్గాల ఎన్నికల సిబ్బందికి జిల్లా ఎన్నికల యంత్రాంగం అందజేస్తోంది.

సర్వే ప్రాధాన్యతాంశాలు ఇలా..

- వయసు 18ఏళ్లు నిండిన, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారికి ఓటు హక్కు కల్పించడం.
- ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ, నకిలీ ఓట్ల గుర్తింపు.
- చనిపోయినవారి (మరణ ధ్రువపత్రం పరిశీలించి, నకలు జతచేసి) ఓట్ల తొలగింపు.
- వందేళ్ల వయసు పైబడిన వారిని గుర్తించడం.
- ఇంటి నంబరు లేకుండా ఉన్న ఓట్లు, ఒకే ఇంటిపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్ల పరిశీలన.
- సర్వీస్ ఓటర్లు(ఆర్మీ), ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలు సరిచేయడం.
- ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో తెలుసుకుని అక్కడి జాబితాలో ఉంచడం.
- ఒక పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1,500 ఓట్లకు మించి ఉంటే కొత్త పోలింగ్ బూత్‌కు సిఫారసు చేయడం.
- పేరు, చిరునామా, ఫోన్ నంబరు , చేర్పులు, తప్పులుంటే సరిచేయడం.
- ఓటరు అభ్యర్థన మేరకు ఓటు బదిలీ.


ఇంటింటికి సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు నాంచారయ్య

ఓటు సరిచూసుకోవాలి



ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జాబితాలో ఓటు ఉందా... వివరాలు సరిగ్గా ఉన్నాయా అనే సమాచారాన్ని ప్రతి ఓటరూ సరిచూసుకోవాలి. తప్పులు ఉంటే సరిచేయించుకోవాలి. సరిదిద్దేందుకు ఆధారం కోసం బీఎల్ఓ అడిగిన పత్రాలు సమర్పించాలి. ముఖ్యంగా వయసు 18 ఏళ్లు నిండిన వారు, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు కావాలి.

– తహసీల్దారు జి.నాంచారయ్య, కొల్లిపర మండలం.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



తెనాలిఅర్బన్: పట్టణంలోని 15వ వార్డు దశరథ రామయ్య వీధిలో నివశించే పిల్లుట్ల కృష్ణకుమారి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. వైఎస్సార్ బీమా కింద ఆమె భర్త లక్ష్మీనారాయణకు ఆదివారం రూ.10వేలు నగదును వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సూరుపుల వెంకట్రావు, ఆర్‌పీ వాసిరెడ్డి కల్యాణి పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనపై ఉచిత శిక్షణ

తెనాలి: పట్టణానికి చెందిన అన్నమయ్య సంకీర్తన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి బుధ, ఆదివారాల్లో చిన్నారులకు అన్నమయ్య సంకీర్తనపై ఉచిత శిక్షణనిస్తున్నట్టు సేవా సమితి కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని మండపం నందు ప్రముఖ గాయని కొండపి వసుంధర శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. అందె తన్మయి, వి.పూర్ణనరసింహం, ఎం.రూపశ్రీ, నంబూరు వినతి, ఎం.అర్చనతో సహా ఇప్పటికే 18 మంది చిన్నారులు సంకీర్తనలు నేర్చుకుంటున్నారనీ, కేవలం అన్నమయ్య సంకీర్తనల ప్రచారం కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. సంకీర్తనలను చక్కగా గానం చేసినవారిని ఏటా తిరుమలకు దర్శనార్థ తీసుకువెళ్తున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి వారం క్రితం తెనాలి రైల్వే స్టేషన్ శివారులో రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చుండూరు(వేమూరు): చుండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకల పాఠశాలలో 5వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపల్ ఎం.లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులు గురుకల పాఠశాలలో అందజేయాలని పేర్కొన్నారు. బీసీ-2, ఎస్టీ-3, ఎస్సీ-25, బీసీ(సీ)-10 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 97030 96428, 99660 08141 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

సహజీవన స్రవంతి పుస్తకావిష్కరణ

పాత గుంటూరు: సమాజంలో పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. పాత గుంటూరు సుద్దపల్లి డొంకలోని సీతారాముల కమ్యూనిటీ హాల్‌లో 50 వసంతాల వాస్తు పరిశీలన, సహజీవన స్రవంతి పుస్తకావిష్కరణ, వాస్తు సిద్ధాంతి గుమ్మా శివ వెంకట లక్ష్మీనారాయణ, సామ్రాజ్యం దంపతులకు సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఒంగోలు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అతుకూరి ఆంజనేయులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీనారాయణ, సామ్రాజ్యం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని ఉగ్గం సాంబశివరావు, బోయిన సుబ్బారావు, కుర్రా పున్నారావు పర్యవేక్షించారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నందుకే అరెస్టులు


మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ

తెనాలి: ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నందుకు కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, అమరుల బంధుమిత్రుల సంఘం నేత కందుల శిరీషను అరెస్ట్ చేయటం హేయమైన చర్యగా ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలను అణచటంలో భాగంగా తీసుకొచ్చిన ఉపా, ఎన్ఐఏలను రద్దుచేయాలన్నారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, ఏఐఎస్‌సీఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి అందే శ్యాం, రాష్ట్ర కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ ఆదివారం స్థానిక కమిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడ సింగ్‌నగర్‌లో దుడ్డు ప్రభాకర్‌ను, ప్రకాశం జిల్లా అలకూరపాడులో కందుల శిరీషను ఎన్ఐఏ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని తెలిపారు. ఏ కేసులో, ఎక్కడకు తీసుకెళుతున్నారో కనీసం కుటుంబసభ్యులకు చెప్పకుండా బలవంతంగా వారిని నంబరు లేని కారులో తరలించటం చట్టవిరుద్ధమన్నారు. 25 ఏళ్లుగా కుల నిర్మూలన పోరాట సమితిలో చట్టబద్ధంగా దళిత, పీడిత కులాల హక్కుల కోసం పోరాడుతున్న ప్రభాకర్‌కు మావోయిస్టులకు సంబంధాలు అంటగట్టడం సరికాదన్నారు. కొమరిగిరి చిన్నమ్మాయి, నాంచారమ్మ, పొట్లూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రచయిత శ్రీరమణ మృతి తీరనిలోటు

తెనాలి: తెనాలి ప్రాంతానికి చెందిన ప్రముఖ హాస్య వ్యంగ్య రచయిత శ్రీరమణ మృతి సాహితీ లోకానికి తీరని లోటని చైతన్య వేదిక, తెనాలి అధ్యక్షుడు, రచయిత డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వేమూరు మండలం వరహాపురానికి చెందిన శ్రీరమణ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. పేరడీతో మొదలుకొని, కథ, నవల, వ్యాసాలతో అసంఖ్యాక పాఠకుల అభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. మిథునం కథతో అపారమైన ఖ్యాతిని పొందారని, బాపు-రమణతో కలిసి కొన్ని సినిమాలకు సంభాషణలను అందించారని పేర్కొన్నారు. పాత్రికేయుడిగా, కాలమిస్ట్‌గానూ తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. శ్రీరమణ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ, 'అరసం' జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కథా రచయిత్రి దాసరి శివకుమారి, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని తదితరులు శ్రీరమణ మృతికి సంతాపం తెలిపారు.

రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగరాజు, శేఖర్

తెనాలిఅర్బన్: ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకులు గంగిశెట్టి నాగరాజు, రావూరి శేఖర్ పేర్కొన్నారు. తెనాలిలోని విద్యుత్‌శాఖ కార్యాలయ సమీపంలో ఆదివారం సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలోని ఎంబీవీకే ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర నాగరాజు, కె.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం


ఉప్పు శిరీషా


షేక్ ఖాజాబీ

వేమూరు: వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా ఉప్పు శిరీష, వైస్ చైర్‌పర్సన్‌గా షేక్ ఖాజాబీ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు యార్డు సెక్రటరీ అంజిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బాపట్ల అర్బన్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పాల్గొంటారని ఆయన తెలిపారు. కొల్లూరు మండలానికి చెందిన ఉప్పు శిరీషా కొల్లూరు గ్రామం నుంచి ర్యాలీతో వచ్చి ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ ర్యాలీగా వచ్చి.. ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

భారతీయ ప్రాచీన కళలకు గొప్ప చరిత్ర

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు


అంబటి రాయుడుతో సిలంబమ్ విజేతలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): భారతీయ ప్రాచీన కళలకు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప చరిత్ర ఉందని ప్రముఖ భారత క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. ఏపీ సిలంబమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజీలో ఆదివారం రాష్ట్ర స్థాయి సిలంబమ్(కర్ర సాము) పోటీలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన లాంఛనంగా ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 155 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్ర బహుమతి ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంబటి రాయుడు మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతిలో ఆత్మ రక్షణకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ సిలంబమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బీవీ నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రిషిరాజ వర్మ, సంయుక్త కార్యదర్శి శివరామ కృష్ణ వర్మ, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణదేవ్ పాల్గొన్నారు.

ఆగస్టు 6న దళిత గిరిజన చైతన్య సదస్సులు

నెహ్రూనగర్: దళిత గిరిజనుల ఆత్మగౌరవ దినంగా పాటిస్తూ దళిత గిరిజన చైతన్య సదస్సులు ఆగస్టు 6న నిర్వహించనున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద దళిత గిరిజన చైతన్య సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లపు నీలాంబరం, ప్రభుదాస్, జాన్‌బాబు, సాల్మన్‌రాజు, ఏసుబాబు పాల్గొన్నారు.

నగరంలో జడి వాన



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఆదివారం జడివాన కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అప్పుడప్పుడు చిన్న చిన్న చినుకులు అప్పుడప్పుడు పెద్దగా వర్షం పడటంతో పాటు, ఈదురుగాలులు రావడంతలో నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నెలకొరిగాయి. ఆగకుండా వర్షం పడతుండటంతో నగరవాసులకు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

పెదకాకాని: జాతీయ రహదారిపై వెళుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన తక్కెళ్లపాడు శివార్లలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన దర్శి సుధాకర్‌రావు ద్విచక్రవాహనంపై ఆదివారం సాయంత్రం గుంటూరు సుద్దపల్లి డొంకలో నివాసం ఉంటున్న తన బావ ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో తక్కెళ్ళపాడు శివారు ప్రాంతంలోకి చేరుకునే సరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన డివైడర్ వెంట ఉన్న ఇనుప రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తలకు గాయం కావడంతో రక్తస్రావమైన సుధాకరరావు (36) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అదే సమయంలో వర్షం పడటంతో ప్రమాదం జరిగిన సమాచారం కూడా ఆలస్యంగా చేరింది. వాహనదారుల సమాచారం మేరకు పెదకాకాని పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



గుంటూరు రూరల్: ఉత్తర నక్షత్రం సందర్భంగా నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోని పద్మావతిదేవి అండాళ్లమ్మ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి రిలీజియస్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతిలో జరిగిన విధంగా ఆలయంలో వేదపండితుల సమక్షంలో భక్తులు పీటలపై కూర్చుని స్వామి కల్యాణం చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం భక్తులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ షబీనాకు ఆర్థిక సాయం


షేక్ షబీనాకు నగదు అందజేస్తున్న అర్చనారెడ్డి

తెనాలి: కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలను కైవసం చేసుకున్న స్థానిక పవర్ లిఫ్టర్ షేక్ షబీనాకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంఎం జ్యూయలర్స్ వద్ద ఆదివారం నగదును షబీనాకు అందించారు. రొమేనియా దేశంలో జరగనున్న వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సాయం చేసినట్టు క్లబ్ సభ్యులు చెప్పారు. అదేవిధంగా బాలికా సాధికారత కార్యక్రమం కింద ఎనిమిది మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కె.అర్చనరెడ్డి, బన్సాలి మణీదేవి, క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, విశిష్ట అతిథిగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, క్లబ్ సభ్యులు రమేష్ కుమార్ జైన్, నరేష్‌కుమార్ జైన్, డాక్టర్ రవీంద్ర, ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్‌రాజ్ కొఠారి, వీరవల్లి శ్రీధర్, బత్తుల బుజ్జి, ప్రవీణ్ కాకుమాను, కృష్ణచైతన్య, కుర్రా శ్రీనివాసరావు, బన్సాలి జస్వంత్‌కుమార్, బన్సాలి గౌతమ్‌కుమార్, దిల్‌కుష్, మన్‌కుష్ పాల్గొన్నారు.

29న 'మేము కూడా చరిత్ర నిర్మించాం' పుస్తకావిష్కరణ సభ


ఆహ్వానపత్రాలను ఆవిష్కరించిన మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, కవులు

పాత గుంటూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేపట్టిన కుల నిర్మూలన ఉద్యమంలో మహిళల పాత్ర కీలకమైందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని హోటల్లో డాక్టర్ అంబేడ్కర్- జాషువా- పూలే- పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న సీపీఎం కార్యాలయంలో నిర్వహించనున్న మేము కూడా చరిత్ర నిర్మించాం పుస్తకావిష్కరణ సభ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు సిహెచ్.సుశీలమ్మ, సిహెచ్.కోటేశ్వరమ్మ, మాల మహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బత్తుల అనిల్ బాబు, కొమరాల రవికుమార్, నాయీ బ్రాహ్మణ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, కాపు శ్రీనివాస్, చల్లా మధుసూదన్ రావు, సీనియర్ పాత్రికేయులు బండారు సురేష్ బాబు, గాయకులు జాన్ బాబు, చంద్రపాల్ పాల్గొన్నారు.

రేపు మామిళ్లపల్లిలో ఉచిత గుండె వైద్య పరీక్షలు

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఈ నెల 25వ తేదీ మంగళవారం పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో ఉచిత గుండె సంబంధ వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య - వైద్యం రెండూ సమాజానికి రెండు కళ్ల వంటివని విశ్వసించే బజరంగ్ ఫౌండేషన్, సేవా కార్యక్రమాల్ని ఈ రెండు రంగాలలో విస్తృత స్థాయిలో చేపడుతున్నట్లు తెలిపారు. చరిత్రలో శాశ్వతంగా స్థానం సాధించేంత అద్భుత పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో కొనసాగే జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమంలో భాగంగా ‹మీ గుండె పదిలం› అంటూ ఉచిత వైద్య శిబిరాన్ని మామిళ్లపల్లి గ్రామస్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. హృదయ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ముందుగా వైద్య పరీక్షలను, తదనంతర గుండె చికిత్సలు అందించటం లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ మెడ్‌స్టార్ హస్పటల్ వారి సహకారంతో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరానికి ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ బి.విజయచైతన్య, వైద్య బృందం వైద్య పరీక్షలను, వైద్య సహాయాన్ని అందిస్తారని అంబటి మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ప్రజలు ఈ ఉచిత గుండె సంబంధ వైద్య పరీక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కాస్మోటాలజీపై పెరిగిన ఆసక్తి



వర్క్‌షాపునకు హాజరైన వైద్యులతో ప్రధాన వక్త డాక్టర్ అవితాస్‌జాన్‌రాకేష్ ప్రసాద్

గుంటూరు మెడికల్: గుంటూరు అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనీరియాలజిస్ట్స్, అండ్ లెప్రాలజిస్ట్స్ ఆధ్వర్యంలో గుంటూరు మెడికల్ కాలేజ్ జింకానా ఆడిటోరియంలో ఆదివారం లేజర్ వర్క్‌షాప్ జరిగింది. మధురైకు చెందిన డాక్టర్ అవితాస్ జాన్‌రాకేష్‌ప్రసాద్ వర్క్‌షాపునకు ప్రధాన వక్తగా విచ్చేసి లేజర్ చికిత్సలు ఏ విధంగా చేయాలనే విషయాలను రోగులపై చేసి లైవ్‌గా చూపించారు. కాస్మోటాలజీతో అందం, ఆరోగ్యం వస్తాయని, ముఖాలపై గుంతలను లేజర్‌తో ఏ విధంగా మాయం చేయవచ్చు, నల్లమచ్చలను, అవాంచిత రోమాలను ఏ విధంగా తొలగించవచ్చు, చర్మంపై ఏర్పడే చారలు ఏ విధంగా తొలగించవచ్చనే విషయాలను డాక్టర్ అవితాస్ కూలంకుషంగా వివరించి డెమో చేసి చూపించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాస్మోటాలజీపై ప్రజలకు బాగా ఆసక్తి పెరుగుతుందని, పీజీ వైద్యులు ఇలాంటి వర్క్‌షాపుల్లో బాగా నేర్చుకుని ప్రాక్టీస్ చేయాలన్నారు. గుంటూరు వైద్య కళాశాల డెర్మటాలజీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయని, పీజీ వైద్యులు వాటిని వినియోగించుకుని ప్రాక్టీస్ చేయాలంటే ఇలాంటి వర్క్‌షాపులు వినియోగించుకోవాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కాస్మోటాలజీకి మెట్రోపాలిటన్ నగరాల్లో ఎంతో డిమాండ్ ఉందని చెప్పారు. నేటికి గ్రామాల్లో 70శాతం మంది ప్రజలకు కాస్మోటాలజీ పై అవగాహన లేదన్నారు. డిజిటల్ మీడియా వల్ల ప్రజలు నేడు అందానికి చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని, చికిత్స చేసేముందు తప్పనిసరిగా కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఈ కో ఆర్డినేటర్ డాక్టర్ అత్తోట కవిత, అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కె. శ్రీదేవి, సెక్రటరీ డాక్టర్ ఎ.శిరీషా, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె.రాహుల్ కృష్ణ పాల్గొన్నారు.

కాలం కంటే వేగంగా కదలాలి


ఆళ్ల నాగేశ్వరరావును సత్కరించిన అతిథులు, సాహితీవేత్తలు

పాత గుంటూరు: కవులు, రచయితలు కాలం కంటే వేగంగా ముందుకు సాగినప్పుడే సమాజం చైతన్యవంతమవుతుందని సుప్రసిద్ధ కథా రచయిత వడలి రాధాకృష్ణ అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు- రమణ- బాలు కళాపీఠం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్.హెచ్.ఓ హాలులో ఆదివారం ‹కవిమిత్రుల సంగమం- కవి సమ్మేళనం› నిర్వహించారు. సభకు రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్‌లో చోటుచేసుకున్న హేయమైన చర్యల్ని సాహితీవేత్తలంతా ఖండించాలన్నారు. అమానవీయమైన ఈ దుర్ఘటనలపై కవులు రచయితలు గొంతెత్తాలని పిలుపునిచ్చారు. వివిధ సాహితీ ప్రక్రియల్లో తమ నిరసనని తెలియజేయాలని సూచించారు. అధికార భాషా కమిషన్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవులు, రచయితలకు ప్రభుత్వం నుంచి త్వరలో శుభవార్త అందబోతుందని చెప్పారు. డాక్టర్ రమణ యశస్వి రచించిన ‹గణపవరం కథలు› కథల పుస్తకాన్ని రచయిత్రి దినవహి సత్యవతి సమీక్షించారు. ఇటీవల కుసుమ ధర్మన్న సాహిత్యసేవా పురస్కారం అందుకున్న కలిమిశ్రీని అతిథులు, పలువురు సాహితీవేత్తలు సత్కరించారు. లక్నోకు చెందిన వర్మీ వెల్నెస్ ఫౌండేషన్ అవార్డు పొందిన ఆళ్ల నాగేశ్వరరావును సత్కరించారు. బి.జనార్దనరెడ్డి, గోలి హనుమచ్ఛాస్త్రి, మానేపల్లి నరసింహాచారి, పెద్దేటి యోహాను, ఈపూరి ప్రేమకుమార్, షేక్ రహీంసాహెబ్, సాపాటి ప్రభాకర్, మన్నం వెంకట గురువు, కారంచేటి విజయ్ కుమార్, మేళ్లచెర్వు మాధవి, పింగళి భాగ్యలక్ష్మి, ఎం.శ్రీలక్ష్మి, కె.సుబ్రహ్మణ్యం, వి.భీమేశ్వర ప్రసాద్ తమ కవితల్ని వినిపించి సభికుల్ని అలరించారు. కవి సమ్మేళనంలో లంకా మాధవి చదివిన కవిత మొదటి బహుమతి పొందగా, చందు నాగేశ్వరరావు, డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి చదివిన కవితలు రెండో బహుమతిని పొందాయి. జర్నలిస్టు ఎస్.చలపతిరావు, బి.జమదగ్ని పాల్గొన్నారు.